మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే,శాసనసభ విప్ కేపీ వివేకానంద్ తదితరులు

మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

దుండిగల్, మార్చి7: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్‌లోని సప్తపది గార్డెన్స్‌లో శుక్రవారం ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెంచిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఇంట్లో ఒక పురుషుడు చదువుకుంటే ఆ ఇళ్లు మాత్రమే అభివృద్ధి చెందుతుందని, అదే ఒక మహిళ చదువు ఆ కుటుంబంతోపాటు సమాజాభివృద్ధికి దోహదపడుతుందని, మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినప్పుడే దేశాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ యాదవ్, గాజుల సుజాత, విజయలక్ష్మి, నాయకులు సాంబశివా రెడ్డి, ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చలసాని భారతి, శ్రీలత, పద్మ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో...

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు రంగారెడ్డి జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి పావని, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి హాజరై కేక్‌కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేశ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు నటరాజు, కార్యదర్శి యాదయ్య, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి సదాలక్ష్మి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు ఉన్నారు.

మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు

ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 7: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఆడపడుచులు అందరికీ ఎమ్మెల్యే కృష్ణారావు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, స్త్రీ లేనిదే జనమే లేదని.. భూదేవి అంత ఓర్పు ఉన్న ఆ స్త్రీ మూర్తికి మనం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని అన్నారు. శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో మహిళా దినోత్సవ వేడుకల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ ఎంపీపీఎస్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎడ్ల దేవేందర్, ఎస్. వెంకటయ్య, హెచ్ఎం.వసుందర, పీఆర్‌టీయూ అధ్యక్షులు హనుమంతు, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి, జాయలుక్కాస్ జ్యువలరీ మహిళా మేనేజర్ శ్రావణి పాల్గొన్నారు. – మాదాపూర్, మార్చి 7

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పోటీ

మాదాపూర్, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడి గుర్తింపు పొందుతున్నారు. గతంలో మహిళలు సామాజిక అంచనాలకు పరిమితం చేయబడ్డారు. ప్రస్తుత తరుణంలో ఆ సరిహద్దులను సవాల్ చేస్తూ నాయకురాలిగా, సృష్టికర్తగా, ఆవిష్కర్తగా మెలుగుతూ సత్తా చాటుతున్నారు. మహిళలు సామాజిక వర్ధిల్లా రూపంలో, కుటుంబ ఆంశాల నడుమ నిరంతర పోరాటాలను చేస్తున్నారు. మహిళలకు స్వేచ్ఛా, గౌరవం, అవకాశాలు వంటివి మాత్రమే ఆదర్శం కాదని, అందరికీ వాస్తవికత అనే భవిష్యత్తు కోసం ప్రతి మహిళకు మద్దతు ఇస్తే సాధికారత కల్పిస్తూ కలిసి నడవాలి. ప్రతి మహిళ ఆదర్శంగా నిలుస్తూ ప్రత్యేకతను చాటాలి. మహిళలను చులకనగా చూసేవారికి గుణపాఠంగా మారాలి. – శాంతి శ్రీ, న్యాక్ ప్లేస్మెంట్ డైరెక్టర్

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



జగద్గిరిగుట్ట శిరిడి హిల్స్ శంకుస్థాపనలో ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట, మార్చి 7:జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడి హిల్స్ – ఏలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, రుద్ర అశోక్, వేణు యాదవ్, మారయ్య, బాబు గౌడ్, పాపి రెడ్డి, మల్లేశ్ గౌడ్, జైహింద్, శ్రీనివాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ప్రభుత్వ వైద్యశాలను నిర్మించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 7: కూకట్‌పల్లి నియోజకవర్గంలో వంద పడకల ప్రభుత్వ వైద్యశాలను నిర్మించాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీశ్ రెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో లక్షలాది మంది నివసిస్తున్నా ప్రభుత్వ వైద్యశాల లేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు బి.సంజీవరావు, రాఘవేందర్, మేకలమైకల్, తూము సంతోశ్, దేవ సహాయం రవి, సతీశ్‌గౌడ్,, బండిగ నరసింహ, బాబురావు, రాజు ముదిరాజ్, రామ కృష్ణారెడ్డి, వెంకటేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నాయశ్రీ ఫౌండేషన్‌కు విరాళం

మియాపూర్, మార్చి 7: వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయశ్రీ ఫౌండేషన్‌కు సంబంధించిన అనాథ పిల్లలు, స్థానిక నాయకులు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నాయశ్రీ ఫౌండేషన్ వారికి ఫ్యాన్లను విరాళంగా ఇచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన జన్మదినము నాయస్రీ ఫౌండేషన్‌కి సంబంధించిన అనాథ పిల్లలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నేతలు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి. చిత్రంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో శోభారాజు గానామృతం

యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.శోభారాజు వారి శిష్య బృందం వసంతి, అర్చన, ఆశ్రిత, వల్లీ, శ్రీహరిప్రియ, శశికళ, బి.వి.శర్మ, శ్రీహి, వేద, సహస్ర, పద్మావతి, మారుతి విజయలక్ష్మి, అభిరామ్, అక్షయ, సువర్ణ, రాధిక, శారద, నారాయణిలతో సంయుక్తంగా ఉగ్రం వీరం, కొండల్లో నెలకొన్న, శిరుత నవ్వుల వాడే, ప్రహ్లాద వరద గోవిందా, అంబుజాక్షలము ప్రహ్లాద వరదా వంటి బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమయ్య సంకీర్తనలను ముగ్ధ మనోహరంగా ఆలపించారు. దీనికి కీ బోర్డు రాజు, తబలా రమణ మూర్తి వాయిద్య సహకారం అందించారు. అనంతరం ఆలయ పెద్దలు శోభారాజుకు గౌరవ సత్కారం చేశారు. – మాదాపూర్, మార్చి 7

జేఎన్టీయూహెచ్ పరిపాలన భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 7:జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో సాధారణ విద్యార్థులపై దాడులు చేసిన కొందరు విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని వర్సిటీ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలోకి కొంత మంది డిటెండ్ అయిన విద్యార్థులు మద్యం, గంజాయి మత్తులో వచ్చి సాధారణ విద్యార్థులపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థులను గుర్తించి అడ్మిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో నిర్వహించే పలు ఉత్సవాల సందర్భంగా మద్యం తాగి వచ్చి కావాలని గొడవలు చేస్తున్నారని, వీరిపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశామని, తోటి విద్యార్థులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి హామీ మేరకు విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాహుల్ నాయక్, సుజైన్, గగన్, కౌశిక్, నితిన్, సాగర్ నాయక్, దుర్గాప్రసాద్, హేమంత్, బ్రహ్మం, సిద్ధార్థ, సాయికుమార్, అంజి తదితరులు ఉన్నారు.

విద్యార్థిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో విద్యార్థిపై దానికి పాల్పడ్డ ఐదుగురిపై కేసు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన ప్రకారం... జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలోని హాస్టల్‌లో దార్ల సుజయ్(20) నివసిస్తూ చదువుతున్నాడు. ఈనెల 6న గ్రౌండ్‌లో నడుచుకుంటూ వెళుతుండగా... కొందరు వ్యక్తులు వచ్చి అతడిని దుర్భాషలాడుతూ.. తీవ్రంగా కొట్టారు. తమ విషయంలో జోక్యం చేసుకోవద్దని.. హెచ్చరిస్తూ ఎవరికైనా ఫిర్యాదు చేసుకోమని హెచ్చరించి వెళ్లిపోయారు. ఈ ఘటనపై తన స్నేహితుడు కౌశిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి దాడికి పాల్పడిన వ్యక్తులు బడిపాటి రాజా, సిద్దు, యశ్వంత్, దీక్షిత్, కిరణ్ గౌడ్ లుగా గుర్తించారు. వీరంతా గతంలో యూనివర్సిటీలో చదివి బయటికి వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మహిళా ప్రదర్శనను విజయవంతం చేయాలి

జీడిమెట్ల, మార్చి 7 : మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ వరకు ఉదయం 10:30 గంటలకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధ, పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి జి.పద్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వియవంతం చేయాలని కోరారు.

మద్యం మత్తులో రోడ్డుపై యువతుల వీరంగం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 7: మద్యం మత్తులో కారును నడిపిన ఓ యువతి రోడ్డుపై వీరంగం సృష్టించిన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీలో చోటుచేసుకున్నది. ట్రాఫిక్ అధికారులు తెలిపిన ప్రకారం.. గురువారం రాత్రి కూకట్‌పల్లి పటాన్చెరువు మార్గంలోనీ కేపీహెచ్‌బీ కాలనీ పిల్లర్ నంబర్ 740 వద్ద ఓ కారు ముందుగా వెళుతున్న ఓ బైక్‌ను ఢీకొట్టింది. ఇంతలో వాహనదారులు ఆ కారును ఆపగా.. ఓ యువతి కారును నడుపుతుండగా.. మరో ఇద్దరు యువతులు కారులో ఉన్నారు. ఆ మహిళలు వాహనాదారులతో గొడవకు దిగారు. వారంతా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వాహనదారులు అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించగా.. మద్యం మత్తులో ఉండి కారు నడిపిన యువతులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా.. రీడింగ్ 212 పాయింట్లు వచ్చింది. ఈ మేరకు ఆ యువతిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఇరుకు రోడ్లతో నరకయాతన

పర్వత్‌నగర్‌లో ట్రాఫిక్‌తో నిత్యం వాహనదారుల ఇబ్బందులు

పర్వత్‌నగర్ చౌరస్తా నుంచి అయ్యప్ప సొసైటీ వరకు భారీగా నిలిచిపోయిన వాహనాలు

అల్లాపూర్, మార్చి7: పర్వత్‌నగర్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో నిత్యం రద్దీ సమయాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది. దీంతో కైత్లాపూర్ ఫ్లైఓవర్ నుంచి అయ్యప్ప సొసైటీ జూబ్లీహిల్స్ వెళ్లే చౌరస్తా వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఇక పార్వతమ్మ నగర వాసులు కాలినడకన రోడ్డు దాటేందుకు కూడా వీలు లేకుండా పోయిందని వాపోతున్నారు. కూకట్‌పల్లి, జగదిరిగుట్ట నుంచి కైత్లాపూర్ ఫ్లైఓవర్ మీదుగా జూబ్లీహిల్స్ మాదాపూర్ కొండాపూర్ మైండ్ స్పేస్, మణికొండ వెళ్లేందుకు మార్గం సుగమం కావడంతో వాహనాల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో బ్యాంక్‌కాలనీ నుంచి అయ్యప్ప సొసైటీ చౌరస్తా వరకు రోడ్డు ఇరుకుగా ఉండటం ఒక కారణమైతే, మరోవైపు మార్గమధ్యలో ఎక్కడ యూటర్న్ లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతుంది. నిత్యం ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో గంటల తరబడి రోడ్లపై నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు మండిపడుతున్నారు. అయ్యప్ప సొసైటీ చౌరస్తాలో అండర్ పాస్ నిర్మిస్తే ట్రాఫిక్ జామ్ సమస్య తీరుతుందని పర్వత్‌నగర్ వాసులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ట్రాఫిక్ పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం వలనే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని పర్వత్‌నగర్ వాసులు కోరుతున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై జరుగుతున్న రహదారి పనుల కారణంగా మేడ్చల్ వెళ్లే రహదారిపై నిత్యం ట్రాఫిక్ రద్దీ కొనసాగుతున్నది. అయితే ఇవాళ అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సాయంత్రం సమయంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని వాహనదారులు మండిపడుతున్నారు. సుమారు రెండు గంటలుగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారుడు బీఏ రెడ్డి 'స్వధాత్రి' పేరిట ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సింగర్, నటి స్మిత వల్లూరుపల్లి ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలోని చిత్రాలను ఆర్టిస్ట్ రాజేశ్వరరావు, అనంతయ్య, సుభాష్‌బాబులతో కలిసి తిలకించారు. చిత్ర ప్రదర్శనలో 100 చిత్రాలను మార్చి 7వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. – కొండాపూర్, మార్చి 7

పెంచిన ఇంటి పన్ను తగ్గించాలి

కుత్బుల్లాపూర్, మార్చి 7:కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆశాస్త్రీయంగా పెంచుతున్న ఇంటి పన్ను బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ శ్రేణులు కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు పెద్దబుద్దుల సత్తీశ్ సాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలు ఏవైనా ప్రజలు కట్టే పన్నులతో నడుస్తుందన్నారు. అలాంటి వారికి ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అశాస్త్రీయమైన పద్ధతుల్లో పన్నురేట్లు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ కృష్ణారెడ్డి దృష్టికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ శివాజీరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి, ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షులు అశోక్, ఎస్టీ మోర్చ నాయకులు శంకర్‌నాయక్, లక్ష్మి, మాధురి, దుర్గా, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌సాగర్, మురళీకృష్ణ, ప్రకాశ్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డినగర్‌లో అగ్ని ప్రమాదం

మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

జీడిమెట్ల, మార్చి 7:జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రాంరెడ్డినగర్‌లో ఉన్న జగన్నాథ్ ఇండస్ట్రీస్ మోడలింగ్ అల్యూమినియం కంపెనీలో శుక్రవారం ఒకసారిగా మంటలు చెలరేగడంతో అగ్ని ప్రమాదం జరిగింది. జీడిమెట్ల అగ్ని మాపక కేంద్ర సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డినగర్‌లోని జగన్నాథ ఇండస్ట్రీయల్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు ఆ ప్రాంతమంత వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో జీడిమెట్ల అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరగడానికి కారణాలపై అగ్ని మాపక కేంద్రం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు.

అక్రమంగా మద్యం విక్రయం.. కేసు నమోదు

కుత్బుల్లాపూర్, మార్చి7: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పలు దాబాలు, బెల్ట్‌షాపుల నిర్వాహకులపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వెజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గత రెండురోజులుగా పలు దాబాలు, ఇతర బెల్ట్ షాపులలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు కొంపల్లిలోని బైసాకి దాబా, న్యూ ఫ్యామిలీ దాబా, దూలపల్లిలోని స్టీల్‌సిటీలో బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ విజయవర్ధన్ తెలిపారు.వెజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పరిశీలన, సందర్శన ఉంటుందని, శాంతియుతమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు నేరరహిత, ఇతర సంఘటనలకు తావు నివ్వకుండా ఈ వెజిబుల్ పోలీసింగ్ పరిశీలన ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

కొండాపూర్, మార్చి 7: విద్యుదాఘాతంతో విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. చందానగర్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్న గౌరీ, స్నేహితురాలితో కలిసి ఆడుతుండగా.. షటిల్ కాక్ విద్యుత్ తీగలపై పడింది. ఇనుపరాడు సాయంతో కాక్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా.. విద్యుత్ షార్ట్‌కు గురైంది. వెంటనే గౌరీని స్థానికులు దవాఖానకు తరలించారు. కాగా, గౌరీ తల్లిదండ్రులు తమ పాప స్కూల్‌లో ఉందని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పాపను స్కూల్ నుంచి బయటకు ఎలా పంపిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల కిందట విద్యుత్ షార్ట్‌కు గురైనా గౌరీ గురించి స్కూల్ యాజమాన్యం పట్టించుకోలేదని, పోలీసులు పిలిచినా రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, చేతులతోపాటు కడుపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయని, వారం రోజులుగా ఐసీయూలో చికిత్స పొందుతుందన్నారు. రెయిన్‌బో స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ పాపకు ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అందుబాటులోకి రాకుండా తప్పించుకు తిరుగుతున్నారంటూ వాపోయారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ18, బెండకాయ 45, పచ్చిమిర్చి30, బజ్జి మిర్చి 20, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి10, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 18, కాలీఫ్లవర్ 18, దొండ 45, చిక్కుడు 45, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 33, ఆలుగడ్డ 20, కీరా 18, దోసకాయ 24, సొరకాయ 15, పొట్లకాయ (1)18, కందగడ్డ 55, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 34, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ (1) 8 నుంచి 9, చామగడ్డ 55, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠాని 43, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 180, అల్లం 80, వెల్లుల్లి 160, చింతపండు 140గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.